స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com
PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 49 | బుధవారం, 8 జూలై, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 49 | WEDNESDAY, JULY 8, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## హైదరాబాద్ దాహార్తి తీర్చడంలో విఫలం

• కమీషన్ల కోసమే మల్లన్నసాగర్ నుంచి నీటి తరలింపు నిర్ణయం అంటూ ఆరోపణ • ముందస్తు ప్రణాళిక లేక నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శ • కల్వకుంట్ల కవిత 2

# కాళేశ్వరంపై చర్చకు జాయింట్ సెషన్ పెడదాం

## స్పీకర్‌కు లేఖ రాసి తేదీ ఖరారు చేయండి

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్ బహిరంగ సవాల్

• రీడిజైన్ పేరుతో ఊరు, పేరు అంచనాలు మార్చి దోచుకున్నారు • మేడిగడ్డ, కాళేశ్వరం వెన్నెముక.. అది కూలింది అంటే ప్రాజెక్టు కుప్పకూలినట్టే • అక్కడ బ్యారేజ్ వద్ద నిపుణులు చెప్పినా పట్టించుకోలే • కెసిఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆర్థిక ఉగ్రవాదులు • రాష్ట్ర ఖజానాపై లక్ష కోట్ల భారం మోపారు • ప్రాజెక్టు ప్రారంభమైన ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి • కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, జులై7 (వార్త వేదిక సూర్య):

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, మిగతా 2లో..





# డిజిటల్ గవర్నెన్స్‌కు గ్రీన్ సిగ్నల్ 2 లో..

• కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలన్నీ డిజిటలైజేషన్ • ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా చర్యలు • ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించని ఏజెన్సీలపై కఠిన చర్యలు • ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యవస్థ • వంద రోజుల్లో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక • అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

## గర్భిణుల నుంచి ఆరేళ్ల పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్

• నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఫ్రీ బ్రేక్ ఫాస్ట్, లంచ్
• కార్పొరేటర్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
• మహిళల పేరుతోనే హైదరాబాదులో లక్ష ఇందిరమ్మ ఇండ్లు
• రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి
• బాలామృతం కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

2 లో..



# సింగరేణికి తాడిచర్ల బొగ్గు గని

• వేలం లేకుండా తాడిచర్ల-2 కేటాయింపు • కేంద్రం కీలక నిర్ణయం • 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు • ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పతికి అవకాశం • రూ.64 వేల కోట్ల ఆదాయం, 1,200 ఉద్యోగాల అవకాశం • తెలంగాణ ప్రభుత్వానికి రూ.16వేల కోట్ల రెవెన్యూ సమకూరే అవకాశం • ఫైల్‌పై సంతకం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):



తెలంగాణకు కీలకమైన సింగరేణి సంస్థ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను వేలం కాకుండా నేరుగా సింగరేణి సంస్థకు కేటాయిస్తూ ఫైల్‌పై సంతకం చేసినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయంతో సింగరేణికి సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు లభిస్తాయని, ఏటా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తితో 40నుంచి 50ఏళ్లపాటు గని కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ. 64వేల కోట్లకు పైగా ఆదాయం సమ కూరడమే కాకుండా, వేలం ప్రీమియం మినహాయింపు వల్ల సంస్థకు రూ.2,550 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు. సింగరేణి 137ఏళ్ల చరిత్ర కలి గిన తెలంగాణ గుండెచప్పుడు మిగతా 2లో..

## తాడిచర్లతో 40ఏళ్ల పాటు ఢోకా లేదు

• ప్రధాని మోడీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు: డిప్యూటీ సిఎం భట్టి 2



## రూ.338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శ్రీకారం

• ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్‌బీనగర్ పరిధిలో 14 రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన • తెలంగాణ రోడ్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి 2



# విశ్వకర్మలకు రాజకీయ ప్రాధాన్యం దక్కాలి

• ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి • సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):

విశ్వకర్మ సమాజం రాజకీయంగా ఏకమైతేనే తగిన గౌరవం, హక్కులు, అభివృద్ధి సాధ్యమవుతాయని శాసన మండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గణనీయమైన జనాభా ఉన్నప్పటికీ విశ్వకర్మలను వృత్తుల ఆధారంగా విడదీసి వారి సామాజిక బలాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అధికారంలో వాటా దక్కినప్పుడే ఏ వర్గానికైనా స్థిరమైన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. సమావేశంలో విశ్వకర్మల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతిపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ నాయకుడు తంగెళ్లపల్లి రవి, గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్యతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. విశ్వకర్మల ఐదు సంప్రదాయ వృత్తులు ఒకే కులానికి చెందినవిగా అధికారిక గుర్తింపు ఇవ్వాలని, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు ప్రత్యేక విధానం రూపొందించాలని, విశ్వకర్మల వారసత్వాన్ని చాటిచెప్పే మ్యూజియం ఏర్పాటు చేయాలని, వృత్తిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహం కల్పించాలని కోరారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ పేరిట అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మిగతా 2లో..

## ఆయిల్ పామ్, డ్రిప్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

• వానాకాలం సాగుకు ఎక్కడా ఆటంకం లేకుండా చర్యలు • మొక్కజొన్న కొనుగోలు చెల్లింపులు వేగవంతం చేయాలని ఆదేశం • యూరియా సరఫరా, రైతు భరోసా అమలు, ఎల్‌నినో ప్రత్యామ్నాయ కార్యాచరణపై మంత్రి తుమ్మల సమగ్ర సమీక్ష

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):

వానాకాల వ్యవసాయ పనులు నిరాటంకంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు విత్తనం నుంచి పంట విక్రయం వరకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయిల్ పామ్ విస్తరణ, డ్రిప్ పరికరాల సరఫరా, ఎరువుల లభ్యత, మొక్కజొన్న కొనుగోలు చెల్లింపులు, రైతు భరోసా అమలు, ఎల్‌నినో పరిస్థితులకు ప్రత్యామ్నాయ కార్యాచరణపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రైతులు నాటేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో మొక్కల కొరత లేదా సరఫరాలో జాప్యం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. జిల్లాల వారీగా డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి నర్సరీల మిగతా 2లో..







www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
బుధవారం 8 జులై, 2026
సంపుటి: 2 | సంచిక: 49
Follow:

## రూ.338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శ్రీకారం

హైదరాబాద్, జూలై 7 (వార్త వేదిక సూర్య):

ఇబ్రహీంపట్నం మండలం తొర్రూరు గ్రా మంలో రూ.338 కోట్ల వ్యయంతో చేపట్టను న్న ఆధునిక నాలుగు లేన్ల రహదారి ప్రాజెక్టు లకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టనున్న ఈ పనుల ద్వారా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో మొత్తం 149 కిలోమీటర్ల మేర 14 ప్రధాన రహదారులు ఆధునికీకరించబడనున్నాయి. కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.13 వేల కోట్లతో 34 ప్యాకేజీల్లో 6,092 కిలోమీటర్ల మేర 441 రహదారులను హ్యామ్ విధానంలో నిర్మిస్తు న్నామని తెలిపారు. తెలంగాణ రహదారుల ను దేశం మొత్తం చూసేలా అత్యున్నత ప్రమా ణాలతో అభివృద్ధి చేస్తామని, ప్రమాదాలు తగ్గేలా ఆధునిక సౌకర్యాలతో కూడిన నాలు గు లేన్ల రహదారులు నిర్మిస్తామని చెప్పారు. రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా పరిశ్రమలు, పె ట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా పెరు గుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద హయత్‌నగర్–తొర్రూరు–కోహెడ–అనాజ్‌పూర్, అనాజ్‌పూర్–అబ్దుల్లాపూర్‌మె ట్–బండరావిర్యాల, హయత్‌నగర్–కుంట్లూ రు–పసుమాముల–తారామతిపేట, సాగర్ రోడ్డు–ఇంజాపూర్–తొర్రూరు–బ్రాహ్మణపల్లి –రాగన్నగూడ, సాగర్ రోడ్డు–ఇంజాపూర్–హయత్‌నగర్ మార్గాలు నాలుగు లేన్లుగా విస్తరించబడనున్నాయి. తుర్కయాంజాల్, తొర్రూరు, పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన ఆధునిక రహదారులు అం దుబాటులోకి రానున్నాయి. ప్రజా ప్రభుత్వ హయాంలో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడు తున్నామని, గ్రామీణ–పట్టణ ప్రాంతాల అనుసంధానానికి ఈ రహదారి ప్రాజెక్టులు కీలకమవుతాయని అన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## హైదరాబాద్ దాహార్తి తీర్చడంలో ప్రభుత్వం విఫలం

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ తాగునీటి సమస్య కొనసాగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. నగరంలో ఇప్పటికీ రోజుకు దాదాపు 10 వేల నీటి ట్యాంకర్లు బుక్ అవుతున్న పరిస్థితి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తాగునీటి సమస్యపై ఎక్స్ వేదికగా స్పందించిన ఆమె, నగర దాహార్తిని తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్‌కు కొండపోచమ్మ సాగర్ నుంచి తాగునీరు అందించే ప్రణాళికను పక్కనబెట్టి, మల్లన్నసాగర్ నుంచి గోదావరి తాగునీటి ప్రాజెక్టు రెండో, మూడో దశలను చేపట్టడం వెనుక భారీ కమీషన్ల కోసమే నిర్ణయం తీసుకున్నారని కవిత ఆరోపించారు. ఒక సంస్థకు భారీ లాభం చేకూర్చేందుకు ఈ ప్రణాళిక రూపొందించారని, అధికార వర్గాల కమీషన్ల కక్కుర్తి కారణంగా నగర ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి కొరతను ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని కవిత అన్నారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు హెచ్చరించినప్పటికీ ముందస్తు ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు. ఇకనైనా హైదరాబాద్ ప్రజల తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టి, గోదావరి తాగునీటి ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కాళేశ్వరంపై చర్చకు జాయింట్ సెషన్ పెడదాం

(మొదటి పేజీ తరువాయి)

హరీష్‌రావు, కేటీఆ ర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదు లుగా రేవంత్ రెడ్డి అభి వర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతు న్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏవి చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయా లని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతా యని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిం చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసు కోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కా కుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమ ని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అ పోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనా డు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించా లని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత‘చేవెళ్ల ప్రాజెక్టుగా ఆ నాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టు కున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యం తరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నా రు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యు లేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్ధాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 ల క్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్ధా ల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవ ంత్ చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నె పల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీ లు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతా రని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూ పించి బంగారాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక విడిచే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరయ్యారు.

## డిజిటల్ గవర్నెన్స్‌కు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో జాప్యానికి శాశ్వత పరిష్కారం చూపేలా డిజిటల్ గవర్నెన్స్ వ్యవస్థను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిపాలనను పూర్తిస్థాయిలో డిజిటలై జ్ చేస్తూ ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు అవసరమైన ప్రణా ళికలు, చట్టాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సోమవారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికా రులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూ డా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా సమగ్ర డిజిటల్ వ్యవస్థను రూపొందించాలని స్పష్టం చేశా రు. ఇందుకోసం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యో గుల వివరాలు, వేతనాలు, బ్యాంకు ఖాతాల సమా చారాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశిం చారు. డిజిటల్ గవర్నెన్స్ అమలుపై సమగ్ర కార్యా చరణ రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పా టు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ 100 రోజు ల్లో సమగ్ర నివేదిక సమర్పించి అమలు విధానాన్ని ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రజలకు మె రుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథ కాల లబ్ధిని నేరుగా అర్హుల ఖాతాల్లోకి చేరవేయడం లో డిజిటల్ గవర్నెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్ప టికీ ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గర్భిణుల నుంచి ఆరేళ్ల పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):



హైదరాబాద్‌లోని నాచారంలోని తెలంగాణ ఫుడ్స్ ప్రాంగణంలో బాలామృతం కొత్త ఉత్పత్తి ప్లాంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి ప్లాంట్‌ను ప్రారంభించిన అనం తరం బాలామృతం తయారీ, ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, తెలంగాణ ఫుడ్స్ ఛైర్మన్ ఫహీమ్, టీఎస్ఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిం చాలనే లక్ష్యంతో ప్రారంభమైన బాలామృతం పథకం నేడు ఆధునిక పరిశ్రమగా ఎదిగిందని తెలిపారు. అభివృద్ధి చెందిన ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగానే అత్యాధునిక బాలామృతం ప్లాంట్‌ను ప్రారంభించామని చెప్పారు. మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ ఇప్పటివరకు రెండు కోట్లకు పైగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతో మంజూరు చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. అలాగే వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేయడంతో పాటు వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను కూడా మహిళలకే అప్పగించినట్లు తెలిపారు. 2034 నాటికి తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాదని, ప్రజల భవిష్యత్తు కోసం అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోట్లాది ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నామని, పట్టణ పేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణ లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు ఉపాధ్యాయులకు కూడా భోజన సౌకర్యం కల్పిస్తున్నామని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, నాణ్యమైన విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం

- పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోడీ
- మోడీ పథకాలు కాపీకొట్టామన్న అధ్యక్షుడు
- మిత్రులు మధ్య కాపీరైట్ ఉండదంటూ మోడీ చమత్కారం

న్యూఢిల్లీ, జులై 7: రామాయణ కాలం నుంచి భారత్‘ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సం బంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొ న్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువె ళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరు దేశాల మధ్య బలమైన సహకారం ఇండో‘పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహద పడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థ ను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేక మైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞ తలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాల ను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్‌లు' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు. జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో



అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లా డుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు. రెండు దేశాల్లో జనాభా ఎక్కువ ఉండడం, ప్రకృతి విపత్తులు వంటి సమస్యల నేపథ్యంలో వాటిని అధిగమించడానికి భారత్ అను సరించే పద్ధతులను తాము కూడా పాటిస్తామన్నారు. మోదీ చేపట్టే కార్యక్రమాలలో దేనిపైనా కాపీరైట్ లేకపోవడం సంతోషంగా ఉందంటూ చిరునవ్వులు చిందించారు.ప్రధాని మోదీ ఇండోనేసియాలో పర్యటిస్తున్న క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. ఆ దేశంలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

### ప్రధాని మోడీకి అరుదైన గౌరవం

#### ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

న్యూఢిల్లీ, జులై7: భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా'అవార్డును ప్రధాని మోదీకి ప్రకటిం చింది. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఈ అత్యున్నత పురస్కారాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్ ‘ఇండోనేసియా దేశాల మధ్య చారిత్రక బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ పోషించి న పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయో జనాల కోసం, ఆసియా‘పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల కోసం భారత్ అందిస్తున్న సహకారం అమోఘమైనదని ఆయన ప్రశంసించారు.

## సింగరేణికి తాడిచర్ల బొగ్గు గని

(మొదటి పేజీ తరువాయి)

అని పేర్కొన్న మంత్రి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత 12ఏళ్లుగా అన్ని విధాలుగా సహకరిస్తోం దన్నారు. సింగరేణిలో ప్రస్తుతం 41వేల మంది శాశ్వత ఉద్యోగులు, 31వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, 39 గనుల్లో 21 అండర్‌గ్రౌండ్, 18 ఓపెన్‌కాస్ట్ గనులు కార్యకలాపాలు సాగిస్తున్నాయని చె ప్పారు. ప్రధాన మైనింగ్ ప్రాజెక్టులకు పర్యా వరణ, అటవీ అనుమతులను వేగవంతం చేయడంలో కేంద్రం సహకరిస్తోందని, ఇటీ వల జరిగిన సమీక్ష సమావేశంలో ఉత్పత్తి పెం పు, ఖర్చుల నియంత్రణపై యాజమాన్యానికి సూచనలు చేసినట్లు తెలిపారు. తాను కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకున్నానని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. అక్కడ 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, ఏటా 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి ద్వారా రూ.75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశముందని చెప్పారు. నైని బ్లాక్‌లో 1,500 కొత్త ఉద్యోగాలు, తాడిచర్ల-2 ద్వారా మరో 1,200 ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. 2020 తర్వాత ఏ ప్రభుత్వ రంగ సంస్థకూ కోల్ బ్లాక్ కేటాయించలేదని, సింగరేణి కోసం మాత్రమే ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. ఈ నిర్ణయానికి సహకరించిన నరేంద్ర మోదీకి తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

## తాడిచర్లతో మరో 40 ఏళ్లపాటు ఢోకా లేదు

హైదరాబాద్, జులై 7 (వార్తా వేదిక సూర్య):

సింగరేణికి తాడిచర్ల‘2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయిం చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభు త్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తా డిచర్ల‘2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నా యని వివరించారు. ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్లాక్‌లో జీ‘9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు లభ్యమవుతుందని పేర్కొ న్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి భారీ ఊతం లభించినట్లు అయిందని అన్నారు. దీంతో రైలు, రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత ఉం టుందని చెప్పారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఇది బలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర బొగ్గు బ్లాకులు కూడా సింగరేణికే ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.



## విశ్వకర్మలకు రాజకీయ ప్రాధాన్యం దక్కాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమ కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధం కావాలని సమా వేశంలో వక్తలు పిలుపునిచ్చారు. విశ్వకర్మల సమస్యల పరిష్కా రానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి ఒత్తిడి తీసుకురావా లని నిర్ణయించారు. వచ్చే నెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటించను న్నట్లు తెలిపారు. సమావేశంలో దేవరకొండ కాళిదాస్, ఆడ్లూ రి రవీంద్రాచారి, గాజోజు నాగభూషణం, కుందారం గణేశా చారి, ఉపేంద్రాచారి, దుబ్బాక కిషన్‌రావు, డాక్టర్ చింతమడక సాయిరాం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్, డ్రిప్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి సకాలంలో మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ఆయిల్ పామ్ సాగులో కీలకమైన డ్రిప్ పరికరాల సరఫరాలో కూడా అంతరాయం లేకుండా తయారీ, సరఫరా సంస్థలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, ప్రభుత్వ సబ్సిడీ రైతులకు ఆలస్యం కాకుండా పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు చేసిన రైతులకు చెల్లింపులు పెండింగ్‌లో ఉండరాదని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మొత్తం రైతుల ఖాతాల్లో సకాలంలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. వానాకాలంలో యూరియా కొరత రాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తగిన నిల్వలు ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఎరువుల విక్రయాల సాధ్యాసాధ్యాలను పరిశీలించి, రైతులకు చేరువలో సేవలు అందించడంతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. రైతు భరోసా పథకం అమలును కూడా మంత్రి సమీక్షించి, అర్హులైన ప్రతి రైతుకు ఎలాంటి జాప్యం లేకుండా నిధులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాల వారీగా తొలి ప్రత్యామ్నాయ కార్యాచరణను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, వర్షాభావం ఎదురయ్యే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటలపై వ్యవసాయ విస్తరణ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.






## పెండింగ్ ఫైళ్లపై జూపల్లి ఆగ్రహం

**ఏళ్ల తరబడి ఫైళ్లు పెండింగ్‌లో ఉంచొద్దని అధికారులకు హెచ్చరిక**

**కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ.. 16 అంశాలపై సమగ్ర సమీక్ష**

హైదరాబాద్ జూలై 7 ( వార్తా వేదిక సూర్య )

రెవెన్యూ, అటవీ శాఖల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం పరిపాలన కాదని, చట్టబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపడమే అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించిన మంత్రి, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలిస్తూ సంబంధిత అధికారులను నిలదీశారు.

ఒరిజినల్ ఫైళ్లు, నోట్ ఫైళ్లు, సంబంధిత రికార్డులను తెప్పించి ఒక్కో అంశాన్ని స్వయంగా పరిశీలించిన మంత్రి, ఫైళ్లు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో, ఎవరి వద్ద ఆగిపోయాయో, ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో అధికారులను ప్రశ్నించారు. గతంలో పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా అనేక అంశాలు ఇప్పటికీ అదే దశలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక అధికారి నుంచి మరో అధికారికి ఫైళ్లను పంపించడం కాకుండా బాధ్యతతో పరిష్కారం చూపాలని సూచించారు.

ముక్కిడిగుండం, సోమశిల, రామాపురం, ఎల్లూరు, జటప్రోలు, గోపాలపురం, సింగోటం తదితర ప్రాంతాలకు సంబంధించిన పోడు పట్టాలు, రెవెన్యూ--అటవీ భూ వివాదాలు, జాయింట్ సర్వేలు, పట్టాదారు హక్కులు, లావోని పట్టాలు, భూ రికార్డుల సవరణ, ఫోడి సర్వే, పీఓటీ రెగ్యులరైజేషన్, భూభారతి, వ్యవసాయ మార్కెట్ యార్డు, హార్టికల్చర్ పాలిటెక్నిక్, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 16 అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

ప్రతి అంశానికి సంబంధించిన అర్జిదారులను కూడా పిలిపించి, గ్రామ పాలన అధికారి నుంచి ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది వరకు సంబంధిత అధికారులందరితో కలిసి సమస్యలను పరిశీలించారు. డివిజన్ స్థాయిలో పరిష్కరించగల ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండకూడదని, కలెక్టర్ స్థాయిలో నిర్ణయం అవసరమైన అంశాలను పూర్తి నివేదికలతో వెంటనే పంపాలని ఆదేశించారు. ప్రతి ఫైల్‌కు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, గడువు నిర్దేశించి ప్రజలు మళ్లీ అదే సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు.

## తాగునీటి సమస్యకు తావివ్వొద్దు.. ముందస్తు కార్యాచరణే కీలకం: మంత్రి సీతక్క

హైదరాబాద్ జూలై 7 ( వార్తా వేదిక సూర్య )



రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ సచివాలయంలో సోమవారం జరిగిన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు సమావేశంలో గ్రామీణ ప్రాంతాల తాగునీటి సరఫరా, జలాశయాల్లో నీటి నిల్వలు, రానున్న నెలల్లో అవసరాలపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. వర్షాలు ఆలస్యమైనా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా ముందస్తు ప్రణాళికలతో ప్రజలకు నిరంతర తాగునీరు అందించాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని గ్రామీణ జనావాసాలకు కృష్ణా, గోదావరి బేసిన్‌ల ఉపరితల జలాల నుంచి శుద్ధి చేసిన నీటిని 29 జలాశయాలు, 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ప్రతి జలాశయంలో 45, 90, 180 రోజుల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతను సమీక్షించిన మంత్రి, నీటి మట్టాలను రోజువారీగా పర్యవేక్షిస్తూ ఇరిగేషన్ శాఖతో నిరంతర సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు. జూలై నెలాఖరు వరకు తగిన ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో, రాబోయే 45 రోజుల్లో తగిన ప్రవాహం రాకపోతే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కొంత భాగంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని అధికారులు వెల్లడించారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్క, ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల ఆధారిత పథకాలను వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక నీటి వనరులను వినియోగించడంతో పాటు అవసరమైతే బోర్‌వెల్‌లను లోతుగా తవ్వడం, ఫ్లషింగ్ చేయడం, అద్దె బోర్‌వెల్‌లను వినియోగించడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావం సహా ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఎదురైనా రాష్ట్రంలో తాగునీటి సంక్షోభం రాకుండా ప్రభుత్వం పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి నివాస ప్రాంతానికి సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా అధికారులు ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కృపాకర్ రెడ్డి, పలువురు చీఫ్ ఇంజనీర్లు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# వలస చిన్నారులకూ అంగన్వాడి సేవలు..

**మొబైల్ కేంద్రాలకు శ్రీకారం**

**మంత్రి సీతక్క, వివేక్ చేతుల మీదుగా మొబైల్ అంగన్వాడి వాహనం ప్రారంభం**

**ప్రతి చిన్నారికి పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ-స్కూల్ విద్యే లక్ష్యం.. ఒక్కో వాహనం ద్వారా 300 మందికి సేవలు**

హైదరాబాద్ జూలై 7 ( వార్తా వేదిక సూర్య )

మహిళా, శిశు సంక్షేమ సేవలను వలస కార్మికుల పిల్లలకు సైతం చేరవేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అంగన్వాడి కేంద్రాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రీ-స్కూల్ విద్య అందించేందుకు మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ సంయుక్తంగా మొబైల్ అంగన్వాడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తొలి దశలో ఈ వాహనం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో సేవలు అందించనుంది.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులే దేశ సంపద, దేశ భవిష్యత్తని పేర్కొన్నారు. తెలంగాణ--2047 లక్ష్య సాధనలో నేటి చిన్నారులే కీలక పాత్ర పోషిస్తారని, అందుకే ఏ ఒక్క చిన్నారి కూడా ప్రభుత్వ అంగన్వాడి సేవలకు దూరం కాకూడదనే సంకల్పంతో మొబైల్ అంగన్వాడి కేంద్రాలను తీసుకొస్తున్నామని తెలిపారు. పనుల కోసం నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలకు కూడా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు.

మొబైల్ అంగన్వాడి కేంద్రాల ద్వారా సాధారణ అంగన్వాడి కేంద్రాల్లో లభించే అన్ని సేవలను అందిస్తామని మంత్రి వెల్లడించారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల



పర్యవేక్షణ, ప్రీ-స్కూల్ విద్యతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన తల్లి--శిశు సంక్షేమ సేవలను కూడా ఈ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు నేరుగా వెళ్లి సేవలు అందించడం ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఒక్కో వాహనం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాల్లో చైతన్యాన్ని నింపిన విజ్ఞాన రథాల మాదిరిగానే ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలు ప్రతి చిన్నారికి పోషకాహారం, ఆరోగ్యం, విద్యను చేరవేసి ఆరోగ్యవంతమైన భావితరాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీ షటిల్స్‌తో ఐటీ ఉద్యోగులకు ప్రయాణ సౌలభ్యం ప్రజారవాణా బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: పొన్నం




హైదరాబాద్ జూలై 7 ( వార్తా వేదిక సూర్య )

హైదరాబాద్ నగరంలో ఐటీ ఉద్యోగుల ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చే లక్ష్యంతో డైలీ షటిల్స్ సేవలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం జేఆర్సీ కన్వెన్షన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేక రవాణా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన నిర్వాహకులను అభినందించిన మంత్రి, ప్రజా రవాణా విస్తరణలో ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, అదనపు రవాణా కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్--2047లో రూపొందించిన ప్రణాళికల ప్రకారం ప్రజారవాణాను మరింత ఆధునికీకరించి, నగర వృద్ధికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం రెండింటికీ ప్రాధాన్యం ఇస్తూ లాభాల బాటలోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తూనే, మరో 350 మార్గాల్లో కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. మెట్రో, రైల్వే, ఆర్టీసీ సేవలను అనుసంధానించే "లాస్ట్ మైల్ కనెక్టివిటీ"పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

రవాణా రంగంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈవీ విధానాన్ని అమలు చేస్తున్నామని, డైలీ షటిల్స్ వంటి సేవల్లో కూడా విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచాలని మంత్రి సూచించారు. దీంతో కాలుష్యం తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందుతుందని అన్నారు. మోటారు వాహనాల చట్టానికి అనుగుణంగా అన్ని సేవలు నిర్వహించాలని, నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. స్క్రాప్ విధానం, వాహన్--సారథి సేవలు, ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు, రహదారి ప్రమాదాల నివారణకు రిఫ్లెక్టర్ వ్యవస్థ వంటి పలు సంస్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

హైదరాబాద్ జులై 7 ( వార్త వేదిక సూర్య )

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, అర్హులైన ప్రతి పౌరుడు జూలై 24లోగా తమ ఓటు నమోదును పూర్తి చేసుకోవాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి నివసిస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట్ల ఇంగ్లీషు భాషలోనూ ఎన్యుమరేషన్ ఫారాలు అందుబాటులో ఉంచాలని కోరినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో భాషా సమస్య వల్ల ఓటరు నమోదు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కోరినట్లు చెప్పారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు తొలి దశలో ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, రెండో దశలో వివరాలను ధృవీకరించి వాటిని సేకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 92 శాతం ఫారాల పంపిణీ పూర్తయిందని అధికారులు వెల్లడించారని పేర్కొన్నారు. చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఈ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొన్ని ప్రాంతాల్లో బీఎల్‌వోలను బెదిరిస్తూ వారి విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, ప్రజల వివరాలు నమోదు చేయకుండా ఒత్తిడి తెస్తున్నారని సీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు రాంచందర్‌రావు తెలిపారు. మరికొన్ని చోట్ల బీఎల్‌వోలను ఒకేచోట కూర్చోబెట్టి



వివరాలు సేకరించే పేరుతో అక్రమంగా దొంగ ఓట్లు నమోదు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ అంశాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అక్రమంగా నమోదయ్యే ఓట్లపై బీఎల్‌ఏ-2 ద్వారా ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేపడతామని కూడా అధికారులు స్పష్టం చేశారని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నివసిస్తున్న ఇతర జిల్లాల, ఇతర రాష్ట్రాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టిస్తోందని కూడా సీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు రాంచందర్‌రావు ఆరోపించారు. స్వస్థలంలో లేకుంటే రేషన్, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందదంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ అంశంపై కూడా విచారణకు అధికారులు అంగీకరించారని తెలిపారు. జూలై 24తో గడువు ముగియనున్న నేపథ్యంలో అవసరమైతే గడువు పొడిగింపు కోసం భారత ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించే అంశాన్ని పార్టీ స్థాయిలో పరిశీలిస్తామని ఆయన వెల్లడించారు.

## గుండ్రాంపల్లి ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షునిగా కాసుగణేష్ ఏకగ్రీవ ఎన్నిక

వార్తా వేదిక సూర్య :జూలై 7 చిట్యాల రూరల్

గుండ్రాంపల్లి ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కాసు గణేష్ ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం జరిగింది. అధ్యక్షుడు: కాసు గణేష్ (గుండ్రాంపల్లి) ఉపాధ్యక్షులుగా : కంకల బీరయ్య (ఎల్లంబావి)కార్యదర్శి: కొండె వెంకటేష్ (ఏపూర్) కోశాధికారి: దిందే ఆడవయ్య (కాట్రేవు) డైరెక్టర్లుగా కంకల బుగ్గమ్మ (గుండ్రాంపల్లి) బండ కేతమ్మ (గుండ్రాంపల్లి) వస్పరి జహంగీర్ (అంతమ్మగూడెం) కొండె మహేష్ (వేలిమినేడు) బాలం జంగయ్య (ఎల్లంబావి) గ్రామాలకు చెందిన వారు ఎన్నిక కావడం జరిగింది.





## పర్యాటకాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ.. జూపల్లి ఆదేశాలు

**రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని సూచన**

**పెట్టుబడుల ఆకర్షణ, హెరిటేజ్ వాక్‌లు, అంతర్జాతీయ కార్నివాల్‌పై ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్, జూలై 7 ( వార్తా వేదిక సూర్య )

తెలంగాణను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రస్తుత పర్యాటక కేంద్రాలతో పాటు అభివృద్ధికి అనువైన కొత్త ప్రాంతాలను గుర్తించి మౌలిక వసతులు, సమర్థ నిర్వహణ, విస్తృత ప్రచారం, పెట్టుబడుల ఆకర్షణపై దృష్టి సారించాలని సూచించారు. పర్యాటక ప్రాజెక్టులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా ఆచరణ సాధ్యమైన ప్రతిపాదనలు రూపొందించాలని స్పష్టం చేశారు.

పర్యాటక అభివృద్ధి, ప్రమోషన్, పెట్టుబడుల ఆకర్షణ, హెరిటేజ్ వాక్‌లు, ఉత్సవాల నిర్వహణ, అంతర్జాతీయ స్థాయి హైదరాబాద్ కార్నివాల్ నిర్వహణ అవకాశాలపై పర్యాటక సలహా మండలి సభ్యులు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయిలో పర్యాటక వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రతి జిల్లాలో పర్యాటక కార్యకలాపాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని పరిశీలించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీరు, ఆహారం, వసతి వంటి సౌకర్యాల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. తొలిదశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో తాత్కాలిక కాటేజీల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు పీపీపీ, లీజ్ విధానాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించాలని మంత్రి పేర్కొన్నారు. వింటేజ్ కార్ల మ్యూజియం, స్కల్ప్చర్ వ్యాలీ, గ్రాఫిటీ విలేజ్, హాలిడే విలేజ్, థీమ్ రిసార్టులు వంటి వినూత్న ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు. చార్మినార్, లాడ్‌బజార్, కోఠి, పుత్లీబౌలి ప్రాంతాల్లో హెరిటేజ్ వాక్‌లను విస్తరించడంతో పాటు బోనాలు, బతుకమ్మ, తెలంగాణ కళలు, వంటకాలను పర్యాటక ప్రచారంలో భాగం చేయాలని ఆదేశించారు. పర్యాటకుల కోసం సమగ్ర వెబ్‌సైట్, ప్రచార పుస్తకాలు, శిక్షణ పొందిన గైడ్ల వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు.

హైదరాబాద్‌లో తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింబించే అంతర్జాతీయ స్థాయి కార్నివాల్ నిర్వహణ అవకాశాలను ప్రపంచ ప్రసిద్ధ కార్నివాల్‌ల నమూనాలో అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. సోమశిలలోని 1,600 ఎకరాల భూమిని పర్యాటక అభివృద్ధికి వినియోగించే ప్రణాళికతో పాటు స్టార్ హోటళ్లు, వెడ్డింగ్ డెస్టినేషన్లు, వాటర్ స్పోర్ట్స్, గోల్ఫ్ కోర్సుల ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే పాలంపేట, సోమశిల ప్రాంతాల్లో హోమ్‌స్టేలు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లలో పర్యాటక అవకాశాలను విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## గురుకులాల్లో నాణ్యతకు రాజీ లేదు.. క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రత్యేక దృష్టి

**బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి కమిటీ.. జూలై 16 నుంచి కులవృత్తుల మేళా**

**స్కిల్ డెవలప్మెంట్‌తో ఉపాధి అవకాశాల విస్తరణకు చర్యలు: మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, జూలై 7 ( వార్త వేదిక సూర్య )



రాష్ట్రంలోని బీసీ గురుకులాలు, హాస్టళ్లలో పరిశుభ్రత, పచ్చదనం, నాణ్యమైన సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురుకులాలు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా బీసీ సంక్షేమ అధికారులు క్రమశిక్షణతో పనిచేస్తూ విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను పరిశీలించాలని పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్స్‌లో నాణ్యత పెంపు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, సివిల్స్‌తో పాటు నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ప్రాంతాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జూలై 16 నుంచి హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహించే కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని మంత్రి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుట్టు మిషన్ పథకానికి సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఎకనామిక్ సపోర్ట్ పథకాలపై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

ఐఐటీలు, ఐఐఎంలలో ప్రవేశాలు సాధించిన గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకుని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
బుధవారం
08, జులై 2026
సంపుటి : 2 సంచిక : 49
Follow:

# భూ బదలాయింపుల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం: బీఆర్ఎస్ ఆరోపణ

### 22 వేల అక్రమ భూ బదలాయింపులపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్



హైదరాబాద్, జూలై 7 ( వార్తా వేదిక సూర్య )

రాష్ట్రంలో భారీ స్థాయిలో అక్రమ భూ బదలాయింపులు జరిగాయని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో సాఫ్ట్‌వేర్‌ను మార్చి భూ యజమానులకు, జిల్లా కలెక్టర్లకు తెలియకుండా సుమారు 22 వేల భూ బదలాయింపులు జరిగాయని, దీని విలువ దాదాపు రూ.10 వేల కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రిటైర్డ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, అవసరమైతే సీబీఐ, సీఐడీ లేదా ఈడీతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతులు భూ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, నిషేధిత భూములు, సాదాబైనామా భూములు సహా అనేక భూములు అక్రమంగా ఇతరుల పేర్లకు బదలాయింపు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాల్లో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగాయని తెలిపారు. ఖాజాగూడలోని కొన్ని భూములను ప్రైవేట్ కంపెనీలకు బదలాయించినట్లు పేర్కొంటూ, జనగామలో వెలుగుచూసిన భూ కుంభకోణంపై ప్రభుత్వం పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు.

రూల్--4 ప్రకారం భూ బదలాయింపులకు కొనుగోలుదారు, విక్రేతలకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉండగా, ఆ నిబంధనలను ఉల్లంఘించారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రెవెన్యూ మంత్రి స్పందించి ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని, సంబంధిత నివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భూ బదలాయింపులకు గురైన బాధితులు ముందుకు వస్తే బీఆర్ఎస్ అండగా నిలిచి పోరాటం చేస్తుందని తెలిపారు.

ఏసీబీ కేసుల నమోదులో ప్రభుత్వం రెండు కళ్ల ధోరణి అవలంబిస్తోందని కూడా ఆయన విమర్శించారు. కొందరు అధికారులపై వేగంగా చర్యలు తీసుకుంటూ, మరికొందరిపై మాత్రం ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి నచ్చని అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఈ ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.




### బౌద్ధనగర్ డివిజన్లో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాల సేకరణ

సికింద్రాబాద్, జూలై 07(వార్త వేదిక సూర్య)



మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బౌద్ధనగర్ డివిజన్ అంబర్ నగర్, కౌసర్ మాజిద్ పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ బిఎల్ఓ తో కలసి పర్యటించి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించడంతో పాటు, కొత్త ఓటర్ల నమోదు, పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు వివరించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించి ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా నమోదయ్యేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా ఉత్సాహంగా స్పందిస్తూ తమ వివరాలను ధృవీకరించుకొని అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, రాజేష్, సాయి యాదవ్, బ్రహ్మచారి, వినోద్, బాబా, బాకార్, ఇమ్రాన్, ముజఫర్, ఫరిదా, బాబిత, నందిత, సుకుమారి తదితరులు పాల్గొన్నారు

### పెబ్బేరు: మోడల్ కళాశాల గర్ల్స్ హాస్టల్లో

వార్తా వేదిక సూర్య – ( కొల్లాపూర్ )

తెలంగాణ మోడల్ కళాశాల గర్ల్స్ హాస్టల్లో మంగళవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మోడల్ కళాశాలలో అందిస్తున్న ఉచిత నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర సదుపాయాలను సరిగ్గా వాడుకుని మంచిగా చదివి కళాశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని విద్యార్థినులను కోరారు.

### రాజేంద్రనగర్‌లో ఘనంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

రాజేంద్రనగర్, జులై 07 ( వార్త వేదిక సూర్య ) :



ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ పట్టణంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు వనం నర్సింహా మాదిగ పాల్గొని ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాదిగ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే డప్పును వాయించి ఉద్యమ స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా ప్రేమావతిపేట్, వెంకటేశ్వర కాలనీ, బుద్వేల్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో కూడా ఎంఆర్పీఎస్ జెండాలను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు పోతురాజు యాదయ్య మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ, మద్దూరి రాజు, రాజేంద్రనగర్ కన్వీనర్ గడ్డం సామెల్ మాదిగ, పలుగుచెరువు మహేష్, మంగలారం శ్రీనివాస్, జాన్ పాల్, ఎడ్లకాడి సూర్యం, భాస్కర్, గోపాల్, వీర్లపల్లి నవీన్, మహేష్, లేవిరాజ్, అప్పారెడ్డిగూడెం మహేందర్, కుమార్, సికెందర్, చంద్రశేఖర్, సుమన్, నాని, అనిల్, జనార్దన్, కమల్, కార్తీక్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్గొండ లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

నల్లగొండ బ్యూరో, జులై 7 (వార్తా వేదిక సూర్య )

ప్రభుత్వ మహిళా కళాశాల నల్లగొండ లో ప్రథమ సంవత్సర విద్యార్థినులకు ఓరియంటేషన్ కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు డిగ్రీ సెమిస్టర్ విధానం క్రెడిట్ సిస్టం (సి. బి. సి. ఎస్) బోధ నేతర కార్యక్రమాలు మొదలగు అంశా ల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే శ్రీనివాసరాజు విద్యార్థులను ఆహ్వానం పలుకుతూ.. భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే ఈ మూడు సంవత్సరాల డిగ్రీ కష్టపడి విద్యను అభ్యసించి మరియు నూతన నైపుణ్యాలను అలవర్చుకొని పోటీ ప్రపంచంలో ఉండాలని చెప్పారు. కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రాజారామ్ మాట్లాడుతూ, డిగ్రీ విద్య అనేది కేవలం ఒక సర్టిఫికెట్ కోసం చదివే విద్య కాదని, ఇది వ్యక్తిత్వ వికాసానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి, సమాజానికి బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి గొప్ప అవకాశం అని, విద్యార్థులకు కళాశాల గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ పుస్తకాలు, పత్రికలు చదవడం వల్ల జ్ఞానం మాత్రమే కాదు, ఆలోచనా శక్తి కూడా పెరుగుతుందని తెలియజేశారు. ఓరియంటేషన్ ప్రోగ్రాం బీఎస్సీ ఫిజికల్ సైన్స్ ఇంచార్జ్ డాక్టర్ దయానంద్, డాక్టర్ రవి, డాక్టర్ మల్లీశ్వరి మరియు లైఫ్ సైన్సెస్ ఇంచార్జ్ డాక్టర్ వసంత, డాక్టర్ కె వెంకటకృష్ణ, బిఏ ఇంచార్జ్ డాక్టర్ వై సునీత, ఉప్పలయ్య, బీకాం ఇంచార్జ్ డాక్టర్ సాలయ్య డాక్టర్ అమరావతి మరియు కళాశాల అధ్యాపకులు డాక్టర్ సంధ్య, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ అరవింద, డాక్టర్ పుష్పలత, డాక్టర్ వైవిరామారావు తదితరులు పాల్గొన్నారు.

### డా.పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ కు జన్మదిన శు భాకాంక్షలు

#### బిషప్ దుర్గం ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు

నల్లగొండ బ్యూరో, జులై 7 (వార్తా వేదిక సూర్య )

హైదరాబాద్ లో డా.పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ కు తెలంగాణ దళిత క్రైస్తవ రాష్ట్ర నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూలై 7, 1965 న యల్లయ్య గా జన్మించిన మంద కృష్ణ మాదిగ , అణగారిన మాదిగ సమాజం హక్కుల కోసం పోరాడిన కార్యకర్త అతను 1980 లలో కుల వ్యతిరేక కార్యకర్తగా ఉండి, 1994 లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి అతని కార్యకలాపాలలో కుల వివక్ష, పిల్లల ఆరోగ్యం, ఉచిత గుండె ఆపరేషన్,వికలాంగుల హక్కుల పోరాటం కొరకు ఉద్యమం చేసి. కారంచేడు (1985), చుండూరు (1991) మారణకాండల తర్వాత బలం పుంజుకున్న విస్తృత పోరాటం చేసిన గొప్ప నాయకులు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ లో చింతాడ ఆనంద్ విషయం లో దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ ఎత్తివేయడం పై దేశవ్యాప్తంగా దళితులకు జరుగుచున్న అన్యాయం పై ప్రస్తుతం దళిత క్రైస్తవ ఉద్యమంనకు ఊపిరి పోసిన డా.పద్మ శ్రీ.మంద కృష్ణ మాదిగ అని అన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇరుగు సంసోన్, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.




### తాత్కాలికంగా రద్దయిన ఎలక్ట్రిక్ బస్

వార్తా వేదిక సూర్య దినపత్రిక --- ( కొల్లాపూర్ )

వనపర్తి డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సులను తాత్కాలికంగా రద్దు చేశామని డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఎలక్ట్రిక్ బస్సులు ప్రమాదాలకు గురి కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. వనపర్తి నుంచి హైదరాబాదుకు రోజూ ఏడు ఎలక్ట్రిక్ బస్సులు నడిచేవని ఇప్పుడు అవి రద్దు అయ్యాయని వివరించారు. పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత వాటిని తిరిగి వీటిని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

### మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ

వార్తా వేదిక సూర్య దినపత్రిక --- ( కొల్లాపూర్ )



చందాపూర్ గ్రానూపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ బర్ల నిర్మల మహేందర్, ఉప సర్పంచ్ పుల్లరి నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన వారు విద్యార్థులకు భోజనాన్ని స్వయంగా వడ్డించారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. వార్డు సభ్యులు స్వామి, రాములు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ పద్మమ్మ, గ్రామ కార్యదర్శి రాజేష్, ఎవీ బొజ్జిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వీపనగండ్ల పీహెచ్సీలో ఆశా డే సమావేశం

వార్తా వేదిక సూర్య దినపత్రిక --- ( కొల్లాపూర్ )



వీపనగండ్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్వేత, డాక్టర్ కరుణ, డాక్టర్ భాగ్యశ్రీ డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

### రేపు వనపర్తికి మంత్రి పొంగులేటి

వార్తా వేదిక సూర్య దినపత్రిక --- ( కొల్లాపూర్ )



రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం వనపర్తి జిల్లాలో పర్యటించనున్నారు. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు, రూ.10 కోట్లతో పాలిటెక్నిక్ రాజా బంగ్లా పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రేవల్లి మండల కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, కలెక్టరేట్లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రొసీడింగ్స్, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేయనున్నారు.

# పాలమూరు అభివృద్ధిలో యువత పాత్ర కీలకం



### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రూ.15 లక్షలతో మైత్రి యూత్ అసోసియేషన్ భవనానికి శంకుస్థాపన

మహబూబ్ నగర్ జులై 7 ( వార్తా వేదిక సూర్య ) :

మహబూబ్ నగర్ నగర అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మైత్రి నగర్‌లో ముడా నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న మైత్రి యూత్ అసోసియేషన్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహబూబ్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే యువత చురుకైన భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు.సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో యువత ముందుండాలని,వారి శక్తిని సరైన దిశలో వినియోగిస్తే నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వం యువత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి యూత్ అసోసియేషన్ భవనాలు యువతకు ఉపయోగకరంగా మారతాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్,నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ల పాండురంగారెడ్డి,రమేష్ బాబు ,ఎస్.శేఖర్, మైత్రి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసులు, కార్యదర్శి మైత్రి యాదయ్య, నాయకులు ప్రశాంత్,అబ్దుల్ హక్, కృష్ణ కుమార్ రెడ్డి , తుప్పలి ఆంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఈఓకు బీజేపీ నేతల వినతి

### -ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పాటించాలి
### -రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిన రాంచందర్ రావు బృందం



రాజేంద్రనగర్, జులై 07 ( వార్త వేదిక సూర్య ) :

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ ) ని కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించింది.

?ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల సంఘం పాత్ర కీలకమైందని, రాబోయే రోజుల్లో ప్రతి ప్రక్రియలోనూ పారదర్శకత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా నమోదు, సవరణలతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాము సమర్పించిన వినతిపత్రంపై సీఈఓ తక్షణమే సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సీఈఓను కలిసిన వారిలో బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ అశోక్, రాష్ట్ర కార్యదర్శి జయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి మరియు పార్టీ నాయకులు కొత్త సోల్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌పై ఆరోపణలు

### -బీఆర్ఎస్ నాయకుడు వెంకటేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం
### -కార్పొరేటర్‌ను ప్రశ్నించే ధైర్యం లేకనే ఈ డ్రామాలు
### -కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ శ్రీనివాస్ గుప్త తీవ్ర ఆగ్రహం

రాజేంద్రనగర్, జులై 07 ( వార్త వేదిక సూర్య ) :



బీఆర్ఎస్ పార్టీ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, కాటేదాన్ డివిజన్ ప్రముఖ నాయకుడు సోమ శ్రీనివాస్ గుప్త తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెంకటేష్ వైఖరిపై ధ్వజమెత్తారు. దాదాపు 25 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేతోనే కలిసి రాజకీయాల్లో కొనసాగిన ఒక వ్యక్తి.. ఇప్పుడు హఠాత్తుగా బాబుల్‌రెడ్డి నగర్‌కు ఏమీ జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలా అయితే ఇన్ని సంవత్సరాల పాటు ప్రజల కోసం వెంకటేష్ ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ?ఎమ్మెల్యేపై బురదజల్లితే పార్టీ అధిష్ఠానం కార్పొరేటర్ టికెట్ ఇస్తుందని వెంకటేష్ భావిస్తున్నారని, అది కేవలం భ్రమ మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఒక ఎమ్మెల్యే మొత్తం నియోజకవర్గ అభివృద్ధిని పర్యవేక్షించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. గత పదేళ్లుగా ఇక్కడ వేరే పార్టీకి చెందిన కార్పొరేటర్ ఉన్నారని, స్థానిక సమస్యలపై ఆ కార్పొరేటర్‌ను ప్రశ్నించే ధైర్యం లేకనే, రాజకీయ అవకాశవాదంతో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బాబుల్‌రెడ్డి నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్నారని సోమ శ్రీనివాస్ గుప్త ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్‌లైన్ పనుల నిర్మాణ సమయంలో మంచినీటి పైపులు అడ్డురావడంతో కాంట్రాక్టర్ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, వాటర్ బోర్డు అధికారులకు సమాచారం అందించారు. ఈ సాంకేతిక సమస్య పరిష్కారమైన వెంటనే పనులు యథావిధిగా కొనసాగుతాయి. ఈ పనులన్నింటికీ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక చొరవతోనే నిధులు మంజూరయ్యాయి అన్నారు. గతంలో బాబుల్‌రెడ్డి నగర్‌లో జరిగిన అభివృద్ధి పనుల వద్ద ఫోటోలు దిగి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్న వెంకటేష్, ఇప్పుడు అక్కడ అభివృద్ధే జరగలేదనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని శ్రీనివాస్ గుప్త ఈ సందర్భంగా వివరించారు. స్మశానవాటిక అభివృద్ధి: నూరు మహ్మద్ కుంట సమీపంలోని హిందూ స్మశానవాటికను ఆధునీకరిస్తున్నారు. ?కుంటల సుందరీకరణ: త్వరలోనే నర్సబాయి కుంట సుందరీకరణ, పార్కు అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ?మౌలిక వసతులు: డివిజన్ పరిధిలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చకచకా సాగుతున్నాయి. ?కేవలం నాయకులకు శాలువాలు కప్పడం, పూలదండలు వేయడం వల్ల పార్టీ టికెట్లు రావని, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన వారికే ప్రజా మద్దతు లభిస్తుందని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో ఎవరు అభివృద్ధి చేస్తున్నారో, ఎవరు కేవలం ఎన్నికల స్టంట్ల కోసం విమర్శలు చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని సోమ శ్రీనివాస్ గుప్త స్పష్టం చేశారు.

www.vaarthavedikasurya.com

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY









## జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ అవగాహన సదస్సు

**- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.. ఎస్సై ఇంద్రసేనారెడ్డి సూచన**

రాజేంద్రనగర్, జులై 07 (వార్త వేదిక సూర్య ) :

జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ మరియు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సందీప్ మాట్లాడుతూ, నేటి యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, వ్యక్తిత్వ వికాసం, దేశసేవను లక్ష్యంగా చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, సమాజ నిర్మాణం కోసం ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. శంషాబాద్ పట్టణ ఎస్సై ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల నుంచి అప్రమత్తంగా ఉండడంతో పాటు డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి చట్టాలను గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు సామాజిక అవగాహన కూడా అవసరమని, ఏబీవీపీ నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంఘటన కార్యదర్శి పరుశురాం, నగర కార్యదర్శి బత్తుల భరత్, నగర కార్యకర్తలు దక్ష్, తిరుపతి, మనీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గణపతి, సాయినాథ, దత్తాత్రేయ స్వామివార్ల తృతీయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఆహ్వానం

రాజేంద్రనగర్, జులై 07 ( వార్త వేదిక సూర్య ) :



ఉప్పరపల్లిలోని శ్రీ సాయిబాబా మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న శ్రీ గణపతి స్వామి, సాయినాథ స్వామి, దత్తాత్రేయ స్వామివార్ల తృతీయ వార్షికోత్సవ మహోత్సవాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేడుకల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేసి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వామివార్ల ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, పాలాభిషేకం, మూలమంత్ర హోమం, పుష్పార్చన, మహా హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12:45 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## వాంబే కాలనీలో ఓటరు నమోదు, సవరణలపై ప్రత్యేక శిబిరం..

**ప్రజలకు మార్గదర్శకత్వం అందించిన గుమ్మడి కుమార్, అకేం రాఘవేందర్ యాదవ్**

రాజేంద్రనగర్, జులై 07 ( వార్త వేదిక సూర్య ) :



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, యువజన అధ్యక్షుడు అకేం రాఘవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు, సవరణల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. శిబిరంలో కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తులను నింపించడంలో ప్రజలకు సహాయం అందించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, సరైన విధంగా పూర్తి చేయించి సంబంధిత అధికారులకు సమర్పించేలా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి కుమార్, అకేం రాఘవేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన సహాయం, అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్ ముదిరాజ్, శేఖర్, క్రాంతి నరేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో 'సర్ ' హెల్ప్‌లైన్ ప్రారంభం

**-ఓటర్ల సేవ కోసం తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ**

**-హెల్ప్‌లైన్ నంబర్ 9988079999 విడుదల**

రాజేంద్రనగర్, జులై 07 ( వార్త వేదిక సూర్య ) :

భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్ ) కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించేందుకు బీజేపీ ప్రత్యేక చొరవ తీసుకుంది. నియోజకవర్గ ప్రజలకు ఓటరు నమోదు, సవరణలపై అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు వీలుగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ప్రత్యేకంగా 'సర్ హెల్ప్‌లైన్'ను ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్‌లైన్ సేవలను రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం, ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారు తమ వివరాలను సరిచూసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ ప్రక్రియలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసేందుకు, దరఖాస్తు విధానాన్ని సులభతరం చేసేందుకు ఈ హెల్ప్‌లైన్ వేదికగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

హెల్ప్‌లైన్ ద్వారా లభించే సేవలు:

బీజేపీ నియోజకవర్గ కార్యాలయం ఏర్పాటు చేసిన ఈ హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు క్రింది సేవలపై ఉచితంగా సమాచారం, సహాయం



పొందవచ్చు ?కొత్త ఓటరు నమోదు: ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం. వివరాల సవరణ: ఫారం-8 ద్వారా తప్పులను సరిదిద్దుకోవడం, చిరునామా మార్పులు చేసుకోవడం.?పేర్ల తొలగింపు: ఫారం-7 ద్వారా అనర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియ. ?పత్రాల పరిశీలన: దరఖాస్తుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానాలపై మార్గదర్శకత్వం. ?హెల్ప్‌లైన్ నంబర్: 9988079999 ?రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఓటర్లు, యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఎలాంటి సందేహాలు ఉన్నా.. వెంటనే తమ కార్యాలయ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని, ప్రజా సేవలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ గురుపూజ దినోత్సవం

కోరుట్ల, జూలై 7 (వార్త వేదిక సూర్య ):

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కోరుట్ల నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక సీఎంఎస్ గార్డెన్‌లో గురుపూజ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని స్వయంసేవకులు, ప్రముఖులు, హిందూ సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీ జిన్నా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, సంఘ్‌లో గురుపూజ నిర్వహణ వెనుక ఉన్న విశిష్టతను వివరించారు. హిందూ సమాజంలో, సనాతన ధర్మంలో భగవద్ధ్వజానికి అత్యున్నత స్థానం ఉందని, త్యాగం, సేవ, శీలం, సమర్పణ, దేశభక్తికి ప్రతీకగా నిలిచే భగవద్ధ్వజాన్ని గురువుగా స్వీకరించడం సంఘ్ సంప్రదాయమని పేర్కొన్నారు. వ్యక్తి కంటే విలువలు శాశ్వతమైనవని, అందుకే



వ్యక్తిపూజకు తావు లేకుండా భగవద్ధ్వజాన్ని గురువుగా ఆరాధించడం సంఘ్ ప్రత్యేకత అని ఆయన తెలిపారు. గురుపూజ సందర్భంగా స్వయంసేవకులు భగవద్ధ్వజానికి పుష్పార్చన చేసి గురుదక్షిణ సమర్పించారు. దేశం, ధర్మం, సమాజ సేవ కోసం అంకితభావంతో పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంఘ్ బాధ్యులు, స్వయంసేవకులు, వివిధరంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్యంగా స్పందన




కోరుట్ల, జూలై 7 (వార్త వేదిక సూర్య ):

మానవ సేవే మాధవ సేవ అనే మహోన్నత లక్ష్యంతో కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్యంగా స్పందన లభించింది. ఈ శిబిరంలో 100 మందికి పైగా రోగులకు నేత్ర వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. అనంతరం 46 మందికి కంటి శస్త్రచికిత్స అత్యవసరమని వైద్యులు నిర్ధారించారు. రూ.15,000 విలువైన కంటి శస్త్రచికిత్సను లయన్స్ క్లబ్ ఉచితంగా అందించనున్నారు. 46 మంది రోగులను కరీంనగర్ లోని రేకుర్తి లయన్స్ ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్సతో పాటు ప్రయాణ సౌకర్యం, రెండు రోజుల వసతి, భోజనం అవసరమైన వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకోలేకపోతున్న పేదలకు వరంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్‌వీడీజీ లయన్ గుంటుక చంద్రప్రకాశ్ హాజరై, సమాజ ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం సేవలందిస్తున్న కోరుట్ల లయన్స్ క్లబ్ సభ్యుల ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవ వెలుగు నింపేందుకు మరెందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ గుంటుక మహేష్, కార్యదర్శి లయన్ బెజ్జంకి శ్రీనివాస్ రావు, కోశాధికారి లయన్ పొలాస రవీందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, గుంటుక సురేష్ బాబు,కుందారపు మహేందర్, మంచాల జగన్, అడెపు మధు, అల్లాడి ప్రవీణ్, పోతని ప్రవీణ్, గంద్ర అజయేందర్ రావు, అన్నం అనిల్, జీవన్ రెడ్డి, ఉషాకిరణ్, గుణాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గంగాధర్, రఘునందన్, గంగారెడ్డి, కృష్ణ ప్రసాద్, రవీందర్, రాజశేఖర్, జగపతిరెడ్డి, వెంకటరాములు, రాధాకిషన్ తదితర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు, సిబ్బంది, సేవ

# జగద్గిరిగుట్టలో ఎమ్మార్పీఎస్ 30వ వ్యవస్థాపక దినోత్సవం

**వల్లూరి బాబు, ఎర్ర యాకన్న**

కుత్బుల్లాపూర్, జూలై 07 (వార్త వేదిక సూర్య):

రిజర్వేషన్ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు వ్యక్తపరిచారు. వివరాల్లోకి వెళితే మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట బస్టాండ్ ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో 30వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ సంఘం నిర్మాణం చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరికి రిజర్వేషన్ ఫలాలు అందాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిరసనలు ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించి మాదిగ రిజర్వేషన్ అందించాయని




గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, వల్లూరి బాబు, డప్పు రామస్వామి, ఎర్ర యాకన్న, చిప్పలపల్లి బాబురావు, జోగు వెంకట్, గోల్కొండ రాములు, ఎర్ర వీరన్న, ప్రవీణు, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# వార్త వేదిక సూర్య' కథనానికి స్పందన..

**ప్రగతి కాలనీ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు ప్రారంభం**

రాజేంద్రనగర్, జులై 07 (వార్త వేదిక సూర్య ) :



ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ వార్త వేదిక సూర్య ప్రచురించిన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. కాటేదాన్ డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ రాఘవేంద్ర ఆసుపత్రి నుంచి బృందావన్ కాలనీ వరకు 150 ఎంఎం ఎంఎస్ మంచినీటి పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీ కారణంగా ప్రతిరోజూ వేలాది లీటర్ల తాగునీరు వృథా అవుతోందని, దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు, బీజేపీ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో వార్త వేదిక సూర్యలో కథనం వెలువడిన వెంటనే




జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రగతి కాలనీలోని 150 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను ప్రారంభించారు. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా వేదికగా నిలుస్తున్న వార్త వేదిక సూర్య కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసి భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## సిరిపురం లో క్లస్టర్ రైతులకు కిసాన్ క్రాంతి సప్సిడీ పత్తి విత్తనాల పంపిణి

**గ్రామ ప్రజలు సప్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి**

**సిరిపురం సర్పంచ్ చీటకోరు సంపత్**

జూలై 07 లింగాల ఘపురం (వార్త వేదిక సూర్య )

లింగాల ఘనపురం మండలం సిరిపురం గ్రామమం లో క్లస్టర్ రైతులకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రాంతి పథకం క్రింద 100% సబ్సిడీ తో రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను గ్రామ సర్పంచ్ చిటకోరు సంపత్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా అందించారు ఈ కార్యక్రమం లో ఏ ఈ ఓ ప్రత్యుష,వార్డ్ సభ్యులు బంద్రు బీరయ్య, కంతి భాగ్య, పాక్స్ డైరెక్టర్ వేముల కృష్ణ రెడ్డి, రైతులు, బర్ల సిద్ధులు, బర్ల బుచ్చి రాజు, దయ బీరయ్య, బర్ల కృష్ణ, కోరిపెల్లి రాజు రెడ్డి, బొమ్మెళ్ల స్వతంత్రం,బెందెల ఎల్లయ్య, కొత్త రాములు తదితరులు పాల్గొన్నారు

## మహేశ్వరం గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా : గద గూటి ఎట్టయ్య ముదిరాజ్

మహేశ్వరం జులై 7 వార్త వేదిక సూర్య



మహేశ్వరం మండల కేంద్రంలోని మహేశ్వరం గ్రామ ముదిరాజ్ ముద్దుబిడ్డ, గద గూటి ఎట్టయ్య ముదిరాజ్, మహేశ్వరం ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన శుభ సందర్భంగా మహేశ్వరం ముదిరాజ్ గ్రామ సంఘం నాయకులు, అలాగే మహేశ్వరం గ్రామస్తులు గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు, గ్రామ ముదిరాజ్ అధ్యక్షుడు కాకుండా, నియోజకవర్గ అధ్యక్షుడు పేరు పొందాలని ఉన్నంత స్థాయికి ఎదగాలని తెలియజేశారు,

## చిన్నంబావి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

వార్తా వేదిక సూర్య దినపత్రిక --- ( కొల్లాపూర్ )



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ గారి పుట్టినరోజు సందర్భంగా చిన్నంబావి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను మండల అధ్యక్షులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు విలేకరులు పాల్గొని మందా కృష్ణ మాదిగ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక న్యాయం, మాదిగల హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

## ఘనంగా అశ్వంత్ కుమార్ జన్మదిన వేడుకలు

**నేటి బాలురే రేపటి భావి భారత పౌరులు**

**బి ఆర్ ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్**

కూకట్ పల్లి, జూలై 07 ( వార్త వేదిక సూర్య)



నేటి బాలురే రేపటి భావి భారత పౌరులని బి.ఆర్.ఎస్.వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర్ నగర్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కూకట్ పల్లి బి ఆర్ ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సమక్షంలో పాఠశాలకు వంట సామాగ్రి, విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశ్వంత్ కుమార్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ అధినేత కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు మాచర్ల భద్రయ్య, సత్యనారాయణ, లక్ష్మీ నరసయ్య, సోమేష్, సాయి, రమేష్, రమణ, నరేందర్, ప్రసాద్, మారుతి, రాకేష్, రాజు, అనిల్, దీపు తదితరులు పాల్గొన్నారు. ఎస్ నాయకులు సతీష్ అరోరా సమక్షంలో పాఠశాలకు వంట సామాగ్రి, విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశ్వంత్ కుమార్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ అధినేత కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు మాచర్ల భద్రయ్య, సత్యనారాయణ, లక్ష్మీ నరసయ్య, సోమేష్, సాయి, రమేష్, రమణ, నరేందర్, ప్రసాద్, మారుతి, రాకేష్, రాజు, అనిల్, దీపు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆహార భద్రతా చట్టానికి

# ప్రతిపాదించిన సవరణను ఉపసంహరించాలి

**- వ్యకాస జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య**



**రామన్నపేట జులై 7 (వార్తా వేదిక సూర్య):** జాతీయ ఆహార భద్రతా చట్టం ఎన్ఎఫ్ఎ స్ఏ) కు ప్రతిపాదించిన సవరణను ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. స్థానిక శుభాష్ సెంటర్ లో సిపిఎం-వ్యకాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ ఈ సవరణ ద్వారా అంత్యోదయ అన్న యోజన (ఏఏవై ) కింద ప్రస్తుతం అమలులో ఉన్న కుటుంబ ప్రాతిపదిక అర్హత విధానాన్ని తొలగించి, వ్యక్తి ప్రాతిపదిక అర్హత విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.ఒక్కో వ్యక్తికి 7 కిలోల ఆహార ధాన్యం ఇస్తామని చెప్పినా, పెద్ద కుటుంబాలకు దీనివల్ల ఎలాంటి అదనపు ప్రయోజనం ఉండదు. ఎందుకంటే వారి మొత్తం కోటా ఇప్పటికీ నెలకు 35 కిలోలకే పరిమితం అవుతుంది. అదే సమయంలో, చిన్న కుటుంబాలు ప్రస్తుతం పొందుతున్న 35 కిలోల పూర్తి హక్కును కోల్పోతాయి. దీంతో సమాజంలోని అత్యంత పేద, బలహీన వర్గాలపై ఈ సవరణ తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది.వృద్ధ దంపతులు, వితంతువులు, దివ్యాంగులు, గిరిజన కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, చిన్న కుటుంబాలు వంటి వర్గాలు కుటుంబ పరిమాణంతో సంబంధం లేకుండా దీనిపై ఆధారపడుతున్నాయి. ఈ సవరణ వారి ఆహార భద్రతను దెబ్బతీస్తుంది.

ముఖ్యంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి, సగటు కుటుంబ పరిమాణాన్ని తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలు ఈ సవరణ వల్ల నష్టపోతాయి. ఎన్నో సంవత్సరాలుగా, 2011 జనగణన ఆధారంగా ఉన్న ఎన్.ఎఫ్.ఎస్.ఏ లబ్ధిదారుల జాబితాను నవీకరించాలని విస్తృతంగా డిమాండ్ వస్తోంది. పాత జాబితాల కారణంగా లక్షలాది అర్హులైన ప్రజలు ఇప్పటికీ ఈ చట్టం ప్రయోజనాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుత జనాభా ఆధారంగా లబ్ధిదారుల జాబితాను నవీకరించి, చట్టం పరిధిని విస్తరించాల్సిన బదులు, మోదీ ప్రభుత్వం అత్యంత పేద ప్రజల ఆహార హక్కులను తగ్గించే ఈ సవరణను తీసుకురావడం విచారకరం.

ఈ పేద వ్యతిరేక సవరణ ద్వారా, ప్రజల దీర్ఘకాల పోరాటాల ఫలితంగా ఆహారాన్ని చట్టబద్ధ హక్కుగా గుర్తిస్తూ తీసుకొచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని క్రమంగా బలహీనపరచాలనే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం బహిర్గతమవుతోంది.ప్రతిపాదిత సవరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్ గొరిగెసోములు,బావండ్లపల్లి బాలరాజు,తొలుపునూరి శ్రీనివాస్, వ్యకాస మండల అధ్యక్షుడు మేడి ముకుంద,డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, నాయకులు నాగటి లక్ష్మణ్, గునుగుంట్ల సత్యనారాయణ, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, తుర్కపల్లి నరేష్, గట్టు సుందర్, ఆకిటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు




## ఘనంగా మంద క్రిష్ణ మాదిగ జన్మదిన ,

# ఎం.ఆర్.పి.ఎస్ ఆవిర్భావ వేడుకలు



**అడ్డగూడూర్ జులై 7 (వార్తావేదిక సూర్య) :**మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా లో ఎం.ఆర్.పి.ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జయంతి మరియు ఎం.ఆర్.పి.ఎస్ ఆవిర్బవా దినోత్సవ వేడుకలను ఎం.ఆర్.పి.ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు ఈ సందర్బంగా ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు మాదిగ మోత్కూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్ లు మాట్లాడుతూ 32సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా ఈదుముడి లో పురుడు పోసుకున్న ఎం ఆర్ పి ఎస్ నాటి నుండి నేటి వరకు ఎస్సి వర్గీకరణ కొరకే కాకుండా ఎన్నో సామజిక ఉద్యమలకు మద్దతుగా నిలిచింది అని అన్నారు 32ఏండ్ల వర్గీకరణ కోసం ఎందరో అమరులయ్యారు అని వారి అమరత్వ త్యాగమే వర్గీకరణ అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎం. ఆర్ పి ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాలెంల నరేష్ మాదిగ అడ్డగూడర్ మండల వార్డు సీనియర్ నాయకులు చుక్క యాదగిరి సభ్యులు బాలెంల సురేష్ గూడెపు పరమేష్ దర్శనాల సతీష్ బాలెంల మహేందర్ నీర్మాల వెంకటేష్ బాలెంల మల్లేష్ బాలెంల బాబు బాలెంల బాబు రావు గూడెపు నరేష్ ఇటికాల శంకర్ కందుకూరి నరేష్ గూడెపు దామోదర్ తదితరులు పాల్గొన్నారు

# బాలరాజు గౌడ్‌కు ఆత్మీయ సన్మానం



**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన రాచకొండ బాలరాజు గౌడ్ ను మండల కేంద్రంలో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం అందరిని కలుపుకొని పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు అందే విధంగా కృషి చేయాలని కోరారు. జిల్లా మంత్రులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో పార్టీని మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ,ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరే విధంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు బద్దం నాగార్జున రెడ్డి,గద్దం సోమ నర్సయ్య,ఉయ్యాల అంజయ్య, పల్లె భిక్షం,అంబటి విజయకుమార్,మందుల సురేష్, కస్తూరి వీరాస్వామి, రంగారెడ్డి ,బీసు యాదగిరి చేత రాశి అంజయ్య, కల్లెం నర్సయ్య,, పట్టూరి అంజయ్య, కూరెళ్ళ రాములు, పురుగుల నర్సింహ్మా, కారుపోతుల శ్రీను,గద్దం లక్ష్మయ్య, పల్లపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



**వలిగొండ, జులై 7 ( వార్తా వేదిక సూర్య ):** వలిగొండ వాస్తవం న్యూస్ పట్టణ కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32 సంవత్సరాల ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షులు పల్లెర్ల రామచందర్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరించారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బ దానయ్య మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 32 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ ప్రజా పోరాటాలు చేసి ఎస్సీ వర్గీకరణతో పాటు అన్ని వర్గాలకు కూడా హక్కులు సాధించిన ఘనత మహాజన నేత మందకృష్ణ అని వారు గుర్తు చేశారు ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి సలిగంజి బిక్షపతి ఎస్సీ మోర్చ పల్లెర్ల నరసింహ పోలేపాక బిక్షపతి మోత్కూర్ శ్రీరాములు ఉప కులాల నాయకులు ఎదురుగట్ల యాదగిరి పోలేపల్లి సుదర్శన్ పోలేపాక గణేష్ పోలేపాక ప్రవీణ్ వెంకట గల్ల మహేష్ దుబ్బ మహేష్ సూరేపల్లి స్వామి పల్లెర్ల రాఖి పల్లెర్ల శివ అరూర్ వెంకటేశం గట్టు శివ లోతుకుంట బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

**- డీసీఎంఎస్ మాజీ జిల్లా డైరెక్టర్ జెల్లా వెంకటేష్**



**రామన్నపేట జులై 7 (వార్తా వేదిక సూర్య ) :** చేనేత సహకార సంఘాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కృషి చేయాలని డిసిఎంఎస్ మాజీ జిల్లా డైరెక్టర్ జెల్లా వెంకటేష్ అన్నారు. నూతనంగా మంగళవారం టెర్రీ కాటన్ చేనేత సహకార సంఘం పాలకవర్గం వర్గాన్ని ఆయన శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాలకవర్గం కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. సంఘం నూతన అధ్యక్షునిగా పెండెం వేణు, ఉపాధ్యక్షునిగా వనం నరసింహ కార్యదర్శిగా దొంత నాగరాజు, డైరెక్టర్లుగా గంజి సువర్ణ, సూర్య పెల్లి లావణ్య, అప్పం సంతోష, పెండం భావనారుషి, బోడ యాదగిరి, వనం సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కే సురేష్ నిర్వహించి నియామక పత్రాలను అందజేశారు.

# జూనియర్ కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్టాండ్‌ను వెంటనే పూర్తి చేయాలి

**- నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ఎస్ఎఫ్ఐ ఆందోళన సిద్ధం**

**- వేముల నాగరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు**

**వలిగొండ: జులై 7 (వార్తావేదిక సూర్య) :** వలిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పెండింగ్‌లో ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్టాండ్‌ను పరిశీలించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వేముల నాగరాజు మాట్లాడుతూ, దాదాపు 12 సంవత్సరాల క్రితం మంజూరైన రిక్వెస్ట్ బస్టాండ్ ఇప్పటికీ పూర్తి కాకపోవడం దురదృష్టకరమన్నారు. వలిగొండ పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. కళాశాల సమయం ముగిసిన తర్వాత ఎండలు, వర్షాలను లెక్కచేయకుండా విద్యార్థులు కాలినడకనే పట్టణానికి చేరుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాల వద్ద కనీసం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా ఆగకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేరుకు మాత్రమే రిక్వెస్ట్ బస్టాండ్ మంజూరై సంవత్సరాలు గడిచినా, నిర్మాణం పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.ఈ సమస్యను పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, అప్పట్లో బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు ఎమ్మెల్యే వెంటనే స్పందించి రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా ఆర్టీసీ అధికారులతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణ పనులను నెల రోజుల్లో ప్రారంభించకపోతే



విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతావన్నారుఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భువనగిరి సాయి, ఉదయ్ కిరణ్ చరణ్ లోకేష్ నరేష్ మనోజ్ సన్య హిమబిందు కృతిక,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

**- మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పండ్ల పంపిణీ**

**మోటకొండూరు/జూలై 7(వార్త వేధిక సూర్య):-** మోటకొండూరు మండలంలోని చాడ ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు పండ్ల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆడపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా సమాజానికి ఎమ్మార్పీఎస్ ఎనలేని సేవలు అందిస్తోందని కొనియాడారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధించడంలో మందకృష్ణ మాదిగ అలుపెరగని





పోరాటం చేశారని స్పష్టం చేశారు.

అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించడంతో పాటు, వితంతు మరియు వృద్ధాప్య పింఛన్ల పెంపు కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేశారు.ఈ వేడుకల్లో చాడ మాజీ సర్పంచ్ ముస్తాల సుదర్శన్ మాదిగ, చాడ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ, ముత్తిరెడ్డిగూడెం అధ్యక్షుడు చిట్టిగల ఉప్పలయ్య మాదిగ, మండల నాయకులు బొట్ల నవీన్, బొట్ల రమేష్ పాల్గొన్నారు. వీరితో పాటు గౌడ సంఘం నాయకులు ఈరగాని శ్రీనివాస్ గౌడ్, బీసీ/వీహెచ్‌పీఎస్ మండల కన్వీనర్ ఎండి ఉస్మాన్, రాములు, గుర్రాల రవి, ఆలకుంట్ల శేఖర్, గంధమల్ల నరసింహ, గంధమల్ల పాండు, ఆడపు మహేష్, కడమంచి బాల నరసింహ, గంధమల్ల అబ్రహం, గజ్జల స్వామి, ముస్తాల శ్రీకాంత్, చిట్టిగల చరణ్, ఆడేపు ఉదయ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

https://epaper.vaarthavedikasurya.com
www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
బుధవారం
జులై 8, 2026
సంపుటి : 2, సంచిక : 49
Follow:




# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ పరిధికి చెందిన ఎడ్ల సరిత (మోత్కూరు) కడియం రవీందర్ ( కొండగడప) వివిధ కారణాలతో అనారోగ్యానికి గురై ఇటీవల హైదరాబాద్ లో చికిత్స పొందారు. నిరుపేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద దరఖాస్తు చేసుకున్నారు. రవీందర్ కు 35,500, సరితకు 40 ,000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మంజూరైన చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాచకొండ బాలరాజు, జిల్లా నాయకులు గుర్రం లక్ష్మి నర్సింహ్మా రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం సోమ నర్సయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుగుల నర్సింహ్మా యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చింతల విజయభాస్కర్ రెడ్డి, బద్దం నాగార్జున రెడ్డి, గడ్డం లక్ష్మయ్య, మెంట యాదగిరి, కూరెళ్ళ రాములు, లెంకల వేణు కారుపోతుల శ్రీను, పట్టూరి అంజయ్య అంబటి విజయ్ కుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# పి.ఆర్.సి వేంటనే ప్రకటించాలి ఎస్సీ ఎస్టీ,ఉపాధ్యాయుల సంఘం డిమాండ్

**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య);** ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న పి.ఆర్.సి. డి ఏ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు మండలంలోని ప్రాథమిక, ప్రాధమికోన్నత,,ఉన్నత పాఠశాలలో ఏస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు ప్రత్యేక సదుపాయాల కోసం తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ముఖ్య సలహాదారులు బండారు రవి వర్ధన్ ,మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం మండల కమిటిని జిల్లా అధ్యక్షులు ఎర్ర రఘు ఆధ్వర్యంలో ప్రకటించారు.. మండల కమిటి అధ్యక్షులుగా ఉప్పల శ్రీధర్, ప్రధానకార్యదర్శిగాఎర్రవెల్లి శ్యామ్ కుమార్, ఉపాధ్యక్షులుగా బొమ్మెల మల్లేశ్, కార్యదర్శిగా మాన్క విజయ, నల్లబోత్ రమేష్, కోశాధికారిగా బొలెద్దు సరోజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులు శ్రీధర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ బొడ్డు కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు.పానుగంటి




యాదగిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రబెల్లి



నాగమల్లు, జిల్లా కమిటీ సభ్యులు చిరుమర్తి యాదయ్య, బండారు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సభ్యులుగా సామేల్ నియామకం

**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య);** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సభ్యులుగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ నియమిస్తున్నట్లు సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటన లో తెలిపింది. ఈ సందర్భంగా సామేల్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ సమస్యలపై నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన నియమాకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గానికి సామేల్ కృతజ్ఞతలు తెలిపారు.



# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎస్టీ లకు ఉచిత ప్రవేశాలు
- ఈసారి నుండి సైన్స్ ప్రాక్టికల్స్ స్టడీ సెంటర్ లోనే
- భువనగిరి కో- ఆర్డినేటర్ డాక్టర్ గంజి రమేష్

**యాదాద్రి భువనగిరి /వార్తా వేదిక సూర్య:-** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలోని భువనగిరి శ్రీ లక్ష్మీనర్సింహ్మాస్వామి డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరంలో బీఎ, బీకమ్, మరియు బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్లు పొందుటకు ఆగస్టు నెల 7వ తేదీ వరకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గంజి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి స్టడీ సెంటర్ లో ఈ విద్యా సంవత్సరం నుండి సైన్స్ ప్రాక్టికల్స్ స్టడీ సెంటర్ లోనే నిర్వహిస్తారని ఆయన అన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ విద్యాభ్యాసం, అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను పొందుటకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో ఉద్యోగం చేస్తూ, చదువును మధ్యలో ఆపేసిన వారు, గృహిణులు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఈ విద్యా సంవత్సరం నుండి ఎస్టీలకు (గిరిజనులకు) ఉచితంగా డిగ్రీ ప్రవేశ సౌకర్యం కల్పించిందని, ఇట్టి అవకాశాన్ని ఎస్టీ లు వినియోగించుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల కొరకు ఈ యూనివర్సిటీ డిగ్రీ సర్టిఫికెట్, ఇతర యూనివర్సిటీల డిగ్రీ సర్టిఫికెట్ లతో సమానమని ఆయన అన్నారు. అలాగే డిగ్రీ చదువుతున్న సెకండ్ ఇయర్ మరియు థర్డ్ ఇయర్ విద్యార్థినీ విద్యార్థులు వారి యొక్క ట్యూషన్ ఫీజు చెల్లించడానికి కూడా ఆగస్టు 7 వ తేదీ వరకు చివరి అవకాశం ఉందని, మరింత సమాచారం కొరకు స్టడీ సెంటర్ జాక్ట్ బొజ్జ బాలయ్య, సెల్ 90005 90545 ను సంప్రదించాలని ఆయన తెలిపారు.



# ఆహారభద్రత చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి

**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య):** 2013 లో ఇప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆహారభద్రత అంత్యోదయ కార్డులను సవరించి, పేదలకు ఇస్తున్న 35 కేజీల బియ్యాన్ని పూర్తిగా తగ్గిస్తూ, ఒక్కరికి 7 కిలోల చొప్పున ఇవ్వాలనే చట్ట సవరణను వ్యవసాయ కార్మిక సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన మోత్కూరులో విలేఖరులతో మాట్లాడుతూ ఆహారభద్రత పోషకహారం ప్రజాపంపిణి గురించి మోడీ ప్రభుత్వం గొప్పగా చెబుతున్నప్పటికీ.. దేశంలో ఆకలి దారిద్యం పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆహారభద్రత చట్టాన్ని సవరణ చేసి దారిద్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆహారాన్ని దూరం చేసే విధానాన్ని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఆహార భద్రత తరహాలోనే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పేద పక్షాన పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకునేందుకు మోడీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లి పేదలను ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**గట్టుప్పల.జులై7.వార్త వేధిక సూర్య:** గట్టుప్పల మండల కేంద్రం లో ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు మొద్దు గణేష్ జెండా ఆవిష్కరణ చేసి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ జన్మదిన సందర్భంగా కేకు కటింగ్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.వారు మాట్లాడుతూ మందకృష్ణ మాధిగ అలుపెరుగని పోరాట యోధుడని బహుజన నాయకుడిగా అనేక ఉద్యమాలు చేసి పేదల ప్రక్షాన నిలిచాడన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఖమ్మం లక్ష్మయ్య, వడ్డేపల్లి సైదులు, ఖమ్మం శ్రీను ,అశోక్ ,నరేష్ ,మల్లేష్, సైదులు ,సురేష్, మహేష్, కుమార్, శ్రీకాంత్, గణేష్, చందు తదితరులు పాల్గొన్నారు

# బారాస పై విమర్శలు మాని నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టిసారించాలి

**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య):** ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ పొల్లు పొల్లు పొట్టు పొట్టు అంటే జనం చప్పట్లు కొట్టారని... సామేల్ ఎమ్మెల్యే అయ్యాక ఆయన పనితీరు ఏంటో ఈ మూడు సంవత్సరాల్లోనే నియోజకవర్గ ప్రజలకు అర్థమైందని మోత్కూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి మరిచి తండ్రి కొడుకులు పనిచేస్తున్న తీరును నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారన్నారు. గతంలో పదవులను అమ్ముకోవడం పదవులు వచ్చిన తర్వాత ప్రజలను దోచుకోవడం తప్ప సామేల్ చేసింది ఏం అభివృద్ధి లేక బారాస నాయకులపై ఎగిరి పడుతున్నారని పేర్కొన్నారు. మోత్కూరు మున్సిపాలిటీలో 15 కోట్ల నిధుల విషయంలో కమీషన్ల కోసం కక్కుర్తి పడి వచ్చే నిధులను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే సామేల్ ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో యాకుబ్ రెడ్డి డిమాండ్ చేశారు.



# ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**మోత్కూరు, జూలై 07 ( వార్త వేదిక సూర్య):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బాబు జగ్జీవన్ రావు చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు బందెల శ్రీను ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ తెలంగాణ ప్రభుత్వం చారిత్మాత్మకంగా నిర్ణయం తీసుకొని చట్టాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ వర్గీకరణతో రాష్ట్రంలోని మాదిగ మాదిగ ఉప కులాలు విద్యార్థులకు నిరుద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మాదిగలకు రావలసిన అన్ని హక్కులపై నిరంతరం పోరాటాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జీ కూరెళ్ల సైదులు, మండల నాయకులు చెడిపల్లి ఆదిత్య, గనపాక నవీన్, నల్ల సందీప్ ఎర్రబెల్లి నాగేశ్వర్, మేడి వినయ్, మెంట సునీల్ తదితరులు పాల్గొన్నారు.











Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**